



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన లిఖిత, చైతన్యకుమార్ రెడ్డితో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోరంట్ల : మండలం లోని పాలసముద్రం జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువు తున్న లిఖిత, చైతన్యకుమార్‌రెడ్డి అండర్-14 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామాంజులు యాదవ్ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

లేపాక్షి: మండలానికి చెందిన విద్యార్థి మోహన్ డిసెంబర్‌లో నెల్లూరులో జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎన్నికైనట్లు హెచ్‌ఎం ధనశ్రీ తెలిపారు. మోహన్ వివేకానంద జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. మోహన్‌ను హెచ్‌ఎంతో పాటు పీడీ మహేష్, దీపక్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాబా సన్నిధిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

స్వాగతం పలికిన మంత్రులు, ప్రముఖులు



సత్యసాయి మహాసమాధి దర్శనానికి వెలుతున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

భగవాన్ శ్రీసత్య సాయి బాబా మహాసమాధిని కేంద్ర రహదారులు, రవాణా శాఖకు మంత్రి నితిన్ గడ్కరీ గురువారం దర్శించుకున్నారు. ముందుగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ తదితరులు కేంద్ర మంత్రికి సాదర స్వాగతం పలికారు. సాయికుల్వంత్ హాల్లో జరిగిన సభలో నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ ప్రపంచానికి సేవా మార్గాన్ని నేర్పిన వ్యక్తి సత్యసాయిబాబా అని అన్నారు, ఆకలితో ఉన్న వ్యక్తికి తొలుత అన్నం పెట్టాలి గాని ఆధ్యాత్మికత బోధించరాదని సాయి అన్నారని చెప్పారు. తాను ఎవరినీ బోధించటానికి రాలేదని, ఇక్కడి భక్తి, విలువలు, సేవా భావాన్ని చూసి ఇంకా ఎక్కువ మంచి పని చేయడానికి ప్రేరణ పొందటానికే వచ్చానని నితిన్ గడ్కరీ తెలిపారు. మంచి విద్య, సత్సంగతి, సత్ప్రవర్తన ఇవే ఒక మనిషిని ఉత్తముడిగా తీర్చిదిద్దే మహత్తర గుణాలు అని అన్నారు. జీవితంలో శాంతి ఎంతో ముఖ్యమని, శాంతి ఉన్నచోట సమస్యలు సహజంగానే పరిష్కారాలు పొందుతాయని చెప్పారు. భవిష్యత్తుపై ఆందోళన పెంచుకుంటే అశాంతి పెరుగుతుందని గుర్తుచేశారు. విజ్ఞానాన్ని సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా సంపదగా మార్చగలిగితేనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని వివరించారు.

కేంద్రమంత్రికి విమానాశ్రయంలో ఘన స్వాగతం : పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర జాతీయ రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్ సవితమ్మ, సత్యకుమార్ , ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, బిజెపి నేత సోమ గుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్,ట్రస్ట్ సభ్యులు కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం నితిన్ గడ్కరీ ,రాష్ట్ర మంత్రులు జనార్దన్ రెడ్డి ,కందులు దుర్గేష్ ,సత్యకుమార్ ,సవితమ్మ ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి ,పరిటాల సునీత ,ఎమ్మెస్ రాజు, బిజెపి నేత కేంద్ర నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ప్రశాంతి నిలయం సాయి కుల్వంత హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస గెస్ట్ హౌస్ లో సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులు ,రాష్ట్ర రహదారుల ప్రగతిపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవితమ్మ సత్యకుమార్ ఆర్ అండ్ బి అధికారులతో నితిన్‌గడ్కరీ సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం తోపాటు నూతన జాతీయ రహదారుల ఏర్పాటుపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వివరించారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత,ఎంఎస్ రాజు తమ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితి పై కేంద్రమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఐడిసి రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి , బీసీ గంగన్న, లాయర్ హరికృష్ణ జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, సూర్యనారాయణ, కళ్యాణ్ కుమార్ , నారాయణ, రామాంజి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రులు, ప్రముఖులు

లోటుపాట్లు లేకుండా బాబా శతజయంతి ఉత్సవాలు

అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయి : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బాబా శతజయంతి ఉత్సవాలు, ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించిన గురువారం ఓ ప్రకటన ద్వారా వివరాలు తెలియజేశారు. సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పుట్టపర్తిలో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఈ వేడుకలను నిర్వహిస్తోందన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులూ ఎదుర్కోకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఉత్సవాలను అద్వితీయంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే భారత ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు వేడుకల్లో పాల్గొన్నారన్నారు. ఇప్పటివరకు పుట్టపర్తికి 4,24,153 మంది భక్తులు విచ్చేశారన్నారు. ఇందులో చాలా మంది సాయి100 యాప్ ద్వారా తమ సందర్శన వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం పలు రైల్వే స్టేషన్ల నుంచి పుట్టపర్తికి 261 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడపామన్నారు. 14,272 మంది యాత్రికులు వివిధ ప్రాంతాల నుంచి రవాణా సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. అదనంగా 4,606 మంది యాత్రికులు ఉచిత షటిల్ బస్సు సర్వీసుల ద్వారా పుట్టపర్తికి చేరుకున్నారని వివరించారు. ప్రముఖుల పర్యటనల సందర్భంగా 230 మంది వివిఐపిలకు వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో 25 దాకా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. 8011 మంది ఉచిత ఆరోగ్య శిబిరాల వల్ల వివిధ సేవలను పొందారని తెలియజేశారు. ప్రతిరోజు 95 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ద్వారా వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి నీటి ట్యాంకర్ల ద్వారా 42 కేంద్రాలలో నీటి సరఫరా చేశామన్నారు. 3,56,683 మంది భక్తులకు ఉచితంగా అన్నదానం అందిచామన్నారు. పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో 5500 మంది పోలీస్ సిబ్బంది భద్రతా చర్యల్లో భాగస్వామ్యం అయ్యారన్నారు. గుర్తించిన 18 ప్రదేశాల్లో అగ్నిమాపక సేవల నిమిత్తం వాహనాలను ఏర్పాటు చేసి సిబ్బంది ద్వారా సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ సమస్యలపై స్పందించి సమస్యల పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శిల్పారామం వద్ద సెర్ప్ ద్వారా హస్తకళల శిబిరాలు, ప్రతిరోజు సాయంత్రం సమయంలో శిల్పారామం వద్ద వివిధ సాంస్కృత కార్యక్రమాలు, చిత్రావతి నదీలో తెప్పోత్సవం, చిత్రావతి తీరాన లేజర్ షో ద్వారా సందర్శకులు ఆకట్టుకునే విధంగా ప్రదర్శనలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలియజేశారు.

జాతీయ రహదాలను విస్తరించాలని కేంద్ర మంత్రికి వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

జాతీయ రహదారులను విస్తరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సవిత కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇచ్చారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గురువారం కేంద్ర మంత్రి పుట్టపర్తి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పెనుకొండ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు పరిధిలో శరవేగంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని, కావున ముదిగుబ్బ నుంచి పెనుకొండ, పావగడ మీదుగా చెళ్లికెర వరకూ అంతర్ రాష్ట్ర రహదారిని విస్తరించాలని కోరారు. అలాగే సోమందేపల్లి నుంచి హిందూపురం, దొడ్‌బల్లాపురం మీదుగా యాలహంక వరకూ వెళ్లే రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా విస్తరించాలని, హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే 44వ జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించాలని కోరారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే సునీత వినతి

చెన్నేకొత్తపల్లి : ఎపి, కర్నాటక రాష్ట్రాల మధ్య రహదారులను అనుసంధానం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించారు. ఆమె కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం-ఎగువపల్లి రహదారిని డబుల్ లైన్‌గా విస్తరిస్తే ఎపి, కర్నా టక ప్రాంతాలను అనుసంధానం చేసినట్లు అవుతుందన్నారు. కావున ఆ రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులతో కలిసి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సాయి కుల్వంత్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మా కుటుంబ సభ్యులు బాబాను ఇష్ట దైవంగా కొలుస్తామన్నారు. ఆ మహనీయుని శత జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని ధన్ రోడ్డులో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మమ్మ ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందింది. ఈమెకు టిడిపి సభ్యత్వం ఉంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయంలో వివరించారు. వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయానికి వివరాలను పంపారు. బీమా కంపెనీ రూ. 5లక్షలు మంజూరు చేయడంతో పాటు చెక్కును పార్టీ కార్యాలయానికి పంపారు. దీంతో ఆచెక్కును గురువారం బాధిత కుటుంబానికి పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా అభివృద్ధి డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, టిడిపి నాయకులు మూర్తి, నాగేంద్ర వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్టస్థాయి పోటీలకు కె. బసవనపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కే. బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెహెచ్ రవీంద్రారెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సురేష్ కుమార్, వైఎన్ అరుణ తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్.డి.టి. క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థి ఏ.ప్రవీణ్ ఈనెల 21 నుండి 23 వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. అదేవిధంగా అండర్ -14 బేస్ బాల్ పోటీలకు ఎనిమిదవ తరగతి విద్యార్థిని బి.పవిత్ర త్వరలో మదనపల్లెలో నందు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ ప్రదర్శించడానికి గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు అందించినటువంటి సహాయ సహకారాలను కొనియాడారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇరువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

ప్రజాశక్తి-హిందూపురం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎంటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు పురపాలక సంఘంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఉర్దూ, తెలుగు మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఉన్నతీకరించారని అయితే పోస్టులు మాత్రం భర్తీ చేయలేదని విమర్శించారు. దీంతో విద్యార్థుల చదువు కుంటుపడుతోంది. వెంటనే సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు అవసరమైన సంఖ్యలో విద్యా వాలంటీర్లను మంజూరు చేయాలని కోరారు. ఎనిమిది ఉన్నత పాఠశాలలో నెలకొన్న సబ్జెక్ట్ టీచర్ల, వ్యాయామ ఉపాధ్యాయుల కొరతను నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2025 సంవత్సరంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందిన వారందరికి ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ హిందూపురం శాఖ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్, బాలకృష్ణ, పట్టణ కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'పురం' అభివృద్ధికి మరో రూ.15 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధికి శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ మరో రూ. 15 కోట్లు విడుదల చేయించినట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే హిందూపురం మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎమ్మెల్యే ప్రత్యేకంగా రూ 92.50 కోట్లు మంజూరు చేయించారన్నారు. వాటి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. తాజాగా మరో రూ.15 కోట్లను పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యే విడుదల చేయించినట్లు చెప్పారు. ఆ నిధులకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. అందులో భాగంగా ఆ నిధులతో గాంధీ సర్కిల్ నుండి బాలాజీ సర్కిల్ వరకు 40 అడుగుల రహదారి, డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంభాలు లైటింగ్, బాలాజీ సర్కిల్ నుండి ధర్మపురం బైపాస్ 40 అడుగుల రోడ్డు, డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంభాలు లైటింగ్, రైల్వే రోడ్డు లో డివైడర్స్, విద్యుత్ స్తంభాల లైటింగ్, డి.ఎల్. రోడ్డు విస్తరణకు కృషి చేస్తామన్నారు. పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం పట్ల మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కతజ్ఞతలు తెలిపారు.



నిధులు విడుదలైన ప్రతిని చూపిస్తున్న చైర్మన్ రమేష్ కుమార్

వైసిపి కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చలివెందుల గ్రామపంచాయతీ రాచపల్లిలో వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వైసిపి కార్యకర్తలను గురువారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త వెంకటకృష్ణ రెడ్డి కాలేయ వ్యాధితో బాధపడుతుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మరో కార్యకర్త ఎం.రామకృష్ణారెడ్డి కాలికి శస్త్ర చికిత్స జరగడంతో ఆయన ఇంటికి వెళ్లి దీపిక పరామర్శించారు. వార్డు మెంబర్ నాగి రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాము, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అమానుల్లా, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రఘునాథ్ రెడ్డి స్థానిక నాయకులు వేణుగోపాల్ రెడ్డి ,ఈడిగ నరేష్ గౌడ్, రవీంద్ర రెడ్డి బాబుల్లి, జంగాలపల్లి రవి, అమర్నాథ్ రెడ్డి, హరికష్ణ రెడ్డి, నరసారెడ్డి, ఎం సూర్యనారాయణ రెడ్డి, పోతిరెడ్డి, రామంజి, అజయ్, జై రంగప్ప, రామకష్ణప్ప, నవీన్, చంద్రశేఖర్ బి, దాదా పీర్, సద్దాం, వెంకటరామిరెడ్డి, పడమట రామకష్ణ, గాయత్రి రామాంజనేయరెడ్డి,తూమకుంట తిమ్మరాయప్ప తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన పర్యాటక శాఖ మంత్రి

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక దుర్గావీరభద్ర పాపానేశ్వర ఆలయాన్ని గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. మంత్రికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ఆలయ విశిష్ట తను వివరించారు. అనంతరం స్థానిక పర్యాటక అతిథి గృహంలో ప్రముఖ చరిత్రకారుడు మైనా స్వామి రచించిన 'ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయ నగర-లేపాక్షి-కసాపురం' ఆంగ్ల పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ లేపాక్షి విశిష్టత ప్రపంచం నలుమూలల తెలిసేలా పర్యాట కంగా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మంత్రికి లేపాక్షి ఆలయ, నంది చిత్రపటం అందజేసి సన్మానించారు. మంత్రి వెంట డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, టూరిజం మేనేజర్ లక్ష్మణ్, ఆలయ అధికారి నరసింహమూర్తి, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, బాలాజీ ఉన్నారు.



లేపాక్షి ఆలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం : వైసిపి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రస్తుత కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం మండలంలోని మోరుబాగల్ గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈరలక్కప్ప మాట్లాడుతూ అమలు కాని హామీలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలను అమలు చేయకపోగా రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని తెలిపారు. వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేసి కూటమి ప్రభుత్వంలోని బడా నాయకులకు లబ్ధి చేకూర్చేలా చంద్రబాబు పెద్ద కుట్ర పన్నారని తెలిపారు. కల్తీ మద్యాన్ని అంటగట్టి పేదల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని విమర్శించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ డిఎల్.ఎంజేరేగౌడ్, నాయకులు రామకృష్ణ, నాగరాజు, గుజ్జారప్ప, దేవరాజు, రమేష్, సత్యనారాయణ, ఉమాదేవి, పల్లవి, అశ్వత్థనారాయణ, కరేగౌడ, మాలింగప్ప, మంజునాథ, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలి

చెన్నేకొత్తపల్లి : కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య డిమాండ్ చేశారు. చెన్నేకొత్తపల్లిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయంపై గతంలో కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, తహశీల్దార్‌లకు అర్జీలు ఇచ్చినా ఆలయ ప్రవేశం కల్పించడం లేదని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని, లేనిచో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రవేశం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ, అక్కులప్ప, ముత్యాలప్ప, రామచంద్ర, వన్నూరుస్వామి, లక్ష్మేంద్ర, ఓబులేసు, గంగన్న, శీతప్ప, రామన్న, చెన్నప్ప పాల్గొన్నారు.

'పిఎంఎవై'ను సద్వినియోగం చేసుకోండి

గోరంట్ల : ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పిఎంఎవై) గృహ నిర్మాణ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి సూచించారు. హౌసింగ్ ఏఈ గణేష్ గురు వారం పట్టణంలోని 4వ వార్డులో సొంత స్థలం ఉన్న లబ్ధిదారుడి వద్దకు వెళ్లి జియో మ్యాపింగ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారి వెంట నాయకులు నిమ్మల శ్రీధర్, విద్యాధరణి, నరేష్, అజమతుల్లా, వృషభ, రఘునాథ్‌రెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిప్రకాష్‌కు డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి

గుడిబండ : గుడిబండ పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్ డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. రెడ్డిప్రకాష్ గుడిబండ పంచాయతీ కార్యదర్శిగా రెండేళ్ల పాటు పని చేశారు. ప్రభుత్వం ఈ శాఖలో సీనియార్టీ ప్రకారం ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తున్న నేపథ్యంలో రెడ్డిప్రకాష్ డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయనకు డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు నాయక్, తోటి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

మడకశిర టౌన్/గుడిబండ : మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్యాలయం నుంచి విడుదల చేసి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని గుడిబండ టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప తెలిపారు.

చింతచెట్ల వేలం

గుడిబండ : స్థానిక పశువుల సంత మార్కెట్లో ఉన్న చింత చెట్ల ఫల సాయానికి గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రకాష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. హిరేతుర్పి గ్రామానికి చెందిన ఫొటోస్టూడియో భోజరాజ్ రూ. 60 వేలకు దక్కించుకున్నారు. వేలంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగు వదిలితే చర్యలు

రొద్దం : మండలంలోని గ్రామాల్లో ప్రధాన రోడ్లపైకి ఇళ్లలోని మురుగునీరు వదిలితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. తోడంగిపల్లి పంచాయతీలోని మోపర్లపల్లి గ్రామంలో గురువారం ఎంపిడిఒ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి కలియ తిరిగారు. వారు రోడ్లపై మురుగు నీరు ఉండడం గమనించి ఇకపై ఇళ్లలోని వృథా నీటతిని రోడ్లపైకి వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పురంలో రక్తదానం

ప్రజాశక్తి-హిందూపురం

టిప్పు సుల్తాన్ జయంతోత్సవాల సందర్భంగా తలసీమియా చిన్నారుల కోసం 50 మంది యువకులు గురువారం రక్తదానం చేశారు. షహీద్ టిప్పు సుల్తాన్ అభిమానులు గుడ్డం ఆటోస్టాండు, రిలయన్స్, ఆర్టీసీ కాలనీ, శాంతినగర్, త్యాగరాజనగర్ పరిసర ప్రాంత యువకులు కులమతాలకు అతీతంగా రక్తదానం చేశారు. రిలయన్స్ పెట్రోల్ బంక్ సర్కిల్ లో టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కె .యం. ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో మౌలానా ముక్తియార్ అహ్మద్ బాఖ్వీ, జామియా మసీదు ముతవల్లీ అస్లాం, డిప్యూటీ ముతవల్లీ ఫారూఖ్, డాక్టర్ చరణ్, అన్సార్, అబ్దుల్, బాసిత్, ఎరుకల హక్కుల సంఘం వెంకట రమణ, విశ్రాంత సబ్ ఇన్స్పెక్టర్ ఇక్బాల్, అజ్మతుల్లా, ఉబేదుల్లా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పి.వర్షిత



విద్యార్థిని వర్షితతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-తాడిమర్రి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వతరగతి విద్యార్థిని పి.వర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంపై ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పీడీ అమరాంజనేయులు, పీఈటి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శికి నోటీసు

ప్రజాశక్తి -నంబులపూలకుంట

నంబులపూలకుంట పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయుడుకు డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి గురువారం నాడు సంజాయిషీ నోటీసు అందించారు. అక్రమ లే అవుట్లలో నీటి కుళాయి కనెక్షన్, విద్యుత్ సౌకర్యం కల్పించడంపై వివరణ కోరుతూ నోటీసు ఇచ్చారు. అక్రమ లేఅవుట్ వేయడమే పంచాయతీ చట్టం కింద నేరం అన్నారు. అలాంటి లేఅవుట్లలో నీటి కుళాయిలు, విద్యుత్ కనెక్షన్లను కార్యదర్శి ఎలా ఇచ్చాడన్న దానిపై వివరణ తీసుకోనున్నట్లు చెప్పారు.

యువజన ఉత్సవాల్లో కదిరి విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా యువజన క్రీడా ఉత్సవాలు కదిరి పట్టణం ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కదిరి విద్యార్థులు సైన్స్ ప్రాజెక్ట్‌ల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.రమా, విభాగాధిపతులు పి.భాస్కర్, సహారాబాను, మహబూబ్ బాషా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్.గోవర్ధన్ నాయుడు, వెంకటసుబ్బయ్య, ప్రమోద్, నారాయణరెడ్డి, బాబా రెడ్డి , సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో

కల్లుగీత కార్మికుడు



చికిత్స పొందుతున్న ఆంజనేయులు

చికిత్సాయం కోసం కుటుంబసభ్యుల వేడుకోలు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని ఎం.అగ్రహారం పంచాయతీ తిరుమల దేవరపల్లిలో గత పది రోజుల క్రితం కల్లుగీత కార్మికుడు అనిమల ఆంజనేయులు తాటి చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ప్రస్తుతం అంజనేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. మెరుగైన వైద్యం అందిస్తే కోలుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు కానున్నాయి. పేద కుటుంబం ఇంత డబ్బులు ఖర్చు చేసే స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదరు చూస్తున్నారు. దాతలెవరైనా సాయం అందించి తమ తండ్రి ప్రాణాలు కాపాడాలని ఆంజనేయులు కమార్తెలు, కుమారుడు కోరుతున్నారు.



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

కేరళ ఉన్నత విద్యా పరిశీలనకు ఎన్ఎస్‌పిఆర్ కళాశాల ప్రిన్సిపల్

ప్రజాశక్తి-హిందూపురం

కేరళ రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో అభివృద్ధి, సంస్కరణల తీరుతెన్నులు అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆరుగురు సభ్యులతో కూడిన బృందం వెళ్లనుంది ఈ బృందంలో హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం. ప్రగతి కూడా ఉన్నారు. ఈబృందం శుక్రవారం నుండి ఈ నెల 27వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో పర్యటించనుంది.

రోడ్ల పనుల పూర్తికి సహకరించండి

కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ జాతీయ రహదారి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కేంద్ర జాతీయ రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి విచ్చేశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో పుట్టపర్తి రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవితమ్మ, సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, బిజెపి నేత సోమగుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, ట్రస్ట్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నితిన్‌గడ్కారీ ప్రశాంతి నిలయం చేరుకుని సాయి కుల్వంత హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. బాబా దర్శనం అనంతరం శ్రీనివాస గెస్ట్‌హౌస్‌లో సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల ప్రగతిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రులు, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు నూతన జాతీయ రహదారుల ఏర్పాటుపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్.రాజులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పుట్టపర్తితో పాటు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పెనుగొండ జాతీయ రహదారి 44 నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓడి చెరువు మహమ్మదాబాద్ క్రాస్, సిజి.ప్రాజెక్టు కొక్కంటి క్రాస్ వరకు కదిరి బి చెన్నై జాతీయ రహదారికి కలపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన ఆర్అండ్‌బి రోడ్లు, పాడైన బీటీ రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి, బీసీ గంగన్న పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ప్రజాశక్తి -అనంతపురం

మిస్సింగ్ కేసుకు సంబంధించిన మైనర్ బాలికను ఆమె కుటుంబ సభ్యులకు అనంతపురం త్రీటౌన్ పోలీసులు అప్పగించారు. శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలానికి చెందిన 16 సంవత్సరాల బాలిక మిస్సింగ్ అయినట్లు బాధితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ బాలిక అనంతపురం ఆర్టీసీ బస్టాండులో ఉండగా అనుమానించిన స్థానిక త్రీటౌన్ పోలీసులు ఆరా తీశారు. వివరాలు కనుగొన్నారు. ఆబాలికను గాండ్లపెంట మండలానికి చెందిన మిస్సింగ్ బాలికగా గుర్తించారు. విషయాన్ని అక్కడిపోలీసులకు సమాచారమందించారు. మైనర్ బాలికని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు



బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దృశ్యం

కొండవారిపల్లి రహదారి వద్ద వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లమాడ

మండల కేంద్రంలోని కొండవారిపల్లి రహదారి పక్కన ఈశ్వరయ్య వాటర్ ప్లాంట్ వెనుక ఓ వ్యక్తి మరణించాడు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని వివరాలు సేకరించారు. మృతుడు కదిరి మండలం కుమ్మరివారిపల్లి చెందిన రామాంజినేయులుగా గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో ఆయన గుజరీ సామగ్రి ఏరుకుని జీవనం సాగించేవాడు. ఆయన ఎలా మరణించాడన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తలుపుల : ఉబ్బరవాండ్లపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం వేకువ జామున మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ చింతకుంట కష్టారెడ్డి (డీకే బాబు) మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు సాయంగా రూ.20 వేలను కార్యకర్తల చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రమరెడ్డి, పెద్దఅక్కుల రెడ్డి, సదాశివరెడ్డి, వెంకట్, దివాకర్ రెడ్డి, శ్రీనాథ్, యూనస్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ధర్మవరం రూరల్ : పట్టణంలో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించారు. దాత డోలా ఓబుళమ్మ, రాజారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప మాల వేసుకున్న భక్తులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 1:00గంట నుంచి 2:00 గంటల వరకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ స్వామి, షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

ముదిగుబ్బ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం అభివృద్ధి, సహకార సంఘాల ప్రాముఖ్యత, రుణాల మంజూరు తదితర వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి, సబ్ డివిజనల్ సహకార అధికారి జనార్ధన, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్ షిరిడీ, బ్యాంక్ సూపర్ వైజర్ కీర్తి సాగర్, సిబ్బంది ఎం.శ్రీనివాసులు, వైకుంఠ వాసరెడ్డి, మౌలా సాహెబ్, సాంబ శివ, రాళ్ల అనంతపురం సిఇఒ మహేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

లేఅవుట్‌లకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో వేస్తున్న లేఅవుట్లకు అహుడా అనుమతి తప్పనిసరినిగా ఉండాలని తహశీల్దార్ దేవేందర్ నాయక్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయం సమీపంలో లేఅవుట్లను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనుమతులు లేకుండా వేస్తున్న లేవుట్ పనులను ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా వేస్తున్న లేఅవుట్లలో అనుమతులన్నీ చూసుకుని ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. లేఅవుట్ల లేని వాటిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పార్థసారథి ఈవోఆర్‌డి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఈఆర్ఒ

కార్యకర్తల సంక్షేమానికి టిడిపి పెద్దపీట

మంత్రి సవిత

ప్రజాశక్తి-పరిగి

కార్యకర్తల సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత టెక్స్టైల్ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. మండలంలోని పెదరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త డిఎన్.నాగరాజు ఇటీవల ప్రమాదంలో మరణించారు. తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా ఉన్న నాగరాజు కుటుంబానికి ఆ పార్టీ ప్రమాద బీమా నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. మంత్రి సవితమ్మ మృతుని ఇంటికి వెళ్లి ఆయన భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించి బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంతి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీ ప్రధాన బాధ్యత అన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చొరవతో కార్యకర్తలకు బీమా సదుపాయం కల్పించారన్నారు.



బీమా చెక్కును అందిస్తున్న మంత్రి సవిత

శుద్ధ నీటి మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

మండలంలోని బిందు నగర్ పాఠశాల వద్ద రూ.3.5 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధ నీటి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో శుద్ధ నీరు అందక చాలామంది రోగాల బారిన పడుతున్నారన్న విషయం తెలుసుకున్న మంత్రి వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో దానిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎస్ఎన్.గోవింద్ రెడ్డి, వెంకటేష్ సంజీవ రాయప్ప, మారుతి తిలక్, సింగల్ విండో అధ్యక్షుడు చెన్న కృష్ణారెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటవస్తువుల ప్రాంగణం ప్రారంభం



ఆటవస్తువుల ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాండ్లపెంట

శ్రీ యోగి వేమన ఫౌండేషన్ ఎకనామిక్స్ ఇంజినీరింగ్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ బాలల దినోత్సవంలో భాగంగా మండల పరిధిలోని కటారుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల(ప్రైమరీ) పాఠశాలలో రెండు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆట వస్తువుల ప్రాంగణంను గురువారం ప్రారంభించారు. సమస్త అధినేత ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ యోగి వేమన ఆశయాలకు అనుగుణంగా ఇతరులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో తనవంతు సాయంగా విద్యార్థులకు ఆట వస్తువుల పరికరాలు అందజేశానని తెలిపారు. పాఠశాల పేరుతో 50వేల రూపాయలను డిపాజిట్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నగదు ద్వారా వచ్చే వడ్డీతో ప్రతి ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి నగదు ప్రోత్సాహంగా అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరళ, సురేష్, ఎస్ఆర్ అసోసియేషన్ శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సంధ రాఘవ

మెగా రక్తదాన, కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకుడు సంధ రాఘవ జన్మదినంను పురస్కరించుకుని పట్టణంలో గురువారం నాడు ఆయన అభిమానులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కొత్తపేట ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంధ రాఘవ జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆయన అభిమానులు టిడిపి నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా 33 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం 50 మంది రక్తదానం చేశారు. సంధ రాఘవ సేవలను టిడిపి నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. పేదలు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునే గుణంగా ఆయన్ను గొప్పవ్యక్తిని చేస్తోందన్నారు. సంధ రాఘవ మాట్లాడుతూ ధర్మవరం పట్ణణ ప్రజలు, టిడిపి కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగూర్ హుస్సేన్, సాయినాథ్, అశోక్, ఓం ప్రకాష్, బీబీ, జిలకర శ్రీనివాసులు, జింకా పురుషోత్తం, బొట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు మండల కమిటీ ఎన్నిక

తలుపుల:మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓబుల రెడ్డిపల్లి ఆవరణలో ఎస్‌టియు మండల నూతన కమిటీని గురువారం ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడుగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా విజయ వర్ధన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా హరి ప్రసాద్ రెడ్డి, మహిళా కన్వీనర్ పద్మజ, మైనారిటీ కన్వీనర్ ంబ్రేజ్ బాషా, జిల్లా కౌన్సిలర్లుగా రమణ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ, రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణ, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



నూతన ఎస్టీయు మండల నాయకులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర స్థాయిలో ఈ నెల 21 తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్-17 ఇంటర్ డిస్ట్రిక్స్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్లలో ధర్మవరం విద్యార్థులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ధర్మవరం పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ, కార్తిక్, యేసు బాలికల విభాగంలో శరణ్య, అండర్-14 విభాగంలో ప్రియా దీప్తిలు ఎంపయ్యారు. ధర్మవరం పట్టణానికి చెందిన ఐదు మంది బాస్కెట్‌బాల్‌కు ఎంపిక కావడంపైఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్ నెలలో అనంతపురం నగరం ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు, వీరి ఎంపికపై ధర్మాంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులు గురువారం నాడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా నూజివీడుకు ధర్మవరం నుంచి వెళ్లారు.

ఉచిత వైద్యశిబిరం

గాండ్లపెంట :తిరుపతి శ్రీ రామాదేవి మల్టీస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో మండల కేంద్రంలోని ఎస్ఆర్ బిల్డింగ్ మెయిన్ రోడ్ వద్ద స్థానిక సర్పంచి ఎస్.రహమతుల్లా, సీఎంపి సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వివిధ జబ్బులకు సంబంధించి ఉచిత వైద్యం అందించి మందులను అందజేశారు. 15 మందిని శస్త్రచికిత్సల అవసరం నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మునియమ్మ, పవిత్ర పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిలమత్తూరు :మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మి ఇటీవల బాగేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కాలుకు శస్త్రచికిత్స అవసరం అయ్యింది. ఈ నేపథ్యంలో లేపాక్షి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరవకొత్తపల్లి గ్రామానికి చేరుకుని లక్ష్మిని పరామర్శించారు. ఆయన కుటుంబానికి రూ.10 వేల సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫొటో అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షుడు సందీప్, కార్యదర్శి నాగరాజు, రాజు, రామలింగ, రామచంద్ర, ఉమేష్ పాల్గొన్నారు.

మైనాస్వామి రచనలు అద్భుతం :మంత్రి కందుల

లేపాక్షి :చరిత్రకారుడు మైనాస్వామి రాసిన "ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి- కసాపురం" ఆంగ్ల పుస్తకాన్ని మైనాస్వామి ఎంతో అద్భుతంగా రాశారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. లేపాక్షి పర్యాటక అతిథి గహంలో గురువారం నాడు పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకంగా అభివద్ధి కోసం మైనాస్వామి పలు పుస్తకాలను రచించారని, అవి పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్, పత్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ధర్మవరంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ పౌర శాఖ ప్రధాన గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈవోలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతపులుసు పెద్దన్న పాల్గొన్నారు. వీరితోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, పద్మజ, యువర్ ఫౌండేషన్ సభ్యులు బండ్లపల్లి రంగనాథ్, కవి సుకుమార్, రచయిత ఎల్ఐసి నాగరాజు పాల్గొన్నారు. వారోత్సవాల్లో సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.మురళి, గ్రంథాలయ సిబ్బంది రాము, సరస్వతమ్మ, రమణ నాయక్, గంగాధర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై వ్యాస రచన పోటీలను గురువారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజా బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు శిరీష చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గోపీనాథ్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను గురువారం నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బొజ్జె నాయక్, సిబ్బంది ఖాదర్ బాషా, ఉపాధ్యాయులు గంగరాజు, ఎంపిహెచ్ఎ శ్రీనివాస రెడ్డి, విఆర్ఎ ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగరాలని రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ తెలిపారు. వారం రోజులుగా శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంటాయని వాటిని నిరుద్యోగులు, విద్యార్థులు ఉపయోగించు కోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన 35 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, దివ్య తేజ, ప్రసాద్, తిరుపాలయ్య పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని గ్రంథాలయం 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురవారం నిర్వహించారు. ఎంపీడీవో పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి ఫరియాబాను, ఉన్నత పాఠశాల, నాగార్జున హై స్కూల్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉర్దూ పాఠశాల విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శాంతమ్మ, ఉపాధ్యాయులు అబ్దుల్ అజీమ్, తస్బియా, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మహబూబ్‌బాషా సూచించారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీబాయి, ఉర్దూ టీచర్ సాఫియా తస్లీమాభాను పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వెళ్లి అందుబాటులో ఉన్న పుస్తకాలు, దినపత్రికలు చదివి జ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు సభకు ముఖ్య అతిథు లుగా ఎంఇఒలు రాఘవయ్య, సుధాకర్ హాజరయ్యారు. రాఘవయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే గ్రంథాలయం వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. అక్కడ అందు బాటులో ఉన్న పుస్తకాలు, దినపత్రికలు చదివి విజ్ఞానం పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.మహబుబ్‌బాషా, స్కూల్ హెచ్ఎం నబి, రిటైర్డ్ టీచర్ షమీవుల్లా, ఉపేంద్ర, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి పాఠశాల, మార్గదర్శి విద్యాలయలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున, కరస్పాండెంట్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు నందిని, కవిత, గంగలక్ష్మి, శిరీష, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో మాట్లాడుతున్న ఎంఇఒ రాఘవయ్య

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో అధికారి నాగరాజు ఆధ్వర్యంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా జడ్పీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణమ్మ, ఎంపిపి స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రామాంజనేయులు, రత్నమ్మ, టీచ్ హైస్కూల్ ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయం వెళ్లి పుస్తకాలు, దినపత్రికలు చదివితే భవిష్యత్తులో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, ఎంపిపి స్కూల్, టీచ్ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక గ్రంథాలయంలో అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. యుపి స్కూల్‌లో విద్యార్థులకు ఆటలు, పుస్తక పఠనం, కథలు చెప్పటం, క్విజ్, తదితర పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యుపి స్కూల్ హెచ్ఎం హస్మ గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది నాగరాజు, ఉపాధ్యాయురాలు హసీనా,ఉషారాణి పాల్గొన్నారు.